ఏబీ స్విచ్‌ల మాటేమిటి?

- ఉన్నా పనిచేయని స్విచ్‌లు
- ఎక్కడ సమస్య వచ్చినా సబ్‌స్టేషన్ బంద్
- పట్టించుకోని అధికారులు


అయిజ: సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో ప్రతిపనిని కరెంట్‌తోనే చేసే పని ముట్లు, యంత్రాలు, వస్తువులు వచ్చాయి. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారం చేసేవారి వరకు ప్రతి ఒక్కరు విద్యుత్ వినియోగం తప్పనిసరి. నివాస గృహాల్లో విద్యుత్ అవసరం ఎక్కుగా ఉంటుంది. టీవీలు చూడడం తప్పనిసరి, ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్‌లు, కరెంట్ కుక్కర్లు పనిచేయాలంటే తప్పనిసరిగా విద్యుత్ సరఫరా అవసరమే. రాత్రి సమయంలో కరెంట్ బల్బులు వెలగాలన్నా విద్యుత్ ఉండాల్సిందే. ఇంతటి ప్రాధాన్యత కలిగిన విద్యుత్ సరఫరాకు నిత్యం అంతరాయం ఏర్పడుతుంటే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఏబీ స్విచ్‌లు ఉన్నా పనిచేయని వైనం..

మండల కేంద్రంలో మొత్తం 140 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటికి ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌లు చాలా చోట్ల పనిచేయడంలేదు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు పనిచేస్తున్నా వాటిని ఉపయోగించడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఏబీ స్విచ్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను తొలగించి నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేయాలంటే లైన్‌మెన్‌లు, హెల్పర్లు సబ్‌స్టేషన్‌లోని సిబ్బందికి ఫోన్‌చేసి ఎల్‌సీ తీసుకోవల్సి ఉంటుంది. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

అన్ని వార్డుల్లో అదే సమస్య..

పట్టణంలోని 20 వార్డుల్లో సుమారు 6వేల నివాస గృహాలున్నాయి. ఏ ఇంటిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టాలన్నా ఆ కాలనీకి చెందిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపేయాలి. నూతనంగా నిర్మించిన నివాస గృహానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నా, ట్రాన్స్ ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపేయాలి. అలా చేయాలంటే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్‌ను అమర్చి ఉండాలి. అనేక చోట్ల ఏబీ స్విచ్‌లు పనిచేయడం లేదు. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే అవి పని చేస్తాయి. విద్యుత్ స్తంభాల నుంచి వచ్చే విద్యుత్ సరఫరాను నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు మళ్లించడంతో విద్యుత్ సరఫరాను నిలిపేయాలంటే సబ్‌స్టేషన్ నుంచి బంద్ చేయాలి. అలా చేస్తే ఒకేసారి పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దాని వల్ల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు అమర్చేలా చర్యలు తీసుకోవాలి.



కమతంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనిచేయని ఏబీస్విచ్

ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలి



విద్యుత్ అధికారులు ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయక పోవడంతో ఏ ఇంటికి సమస్య ఉత్పన్నమైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేయాలి. అక్కడ ఏబీ స్విచ్ లేక ఏకంగా సబ్‌స్టేషన్ సిబ్బందికి ఫోన్‌చేసి విద్యుత్ సరఫరాను నిలిపేయిస్తున్నారు. విద్యుత్ అధికారులు ప్రతి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీస్విచ్‌లు ఏర్పాటు చేయాలి

– నీలప్ప, అయిజ

మరమ్మతులు చేయడం లేదు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఏబీ స్విచ్‌లు పనిచేయడంలేదు. వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేపడితే అవి పనిచేస్తాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఏబీ స్విచ్‌లు మరుగునపడ్డాయి. ఏబీస్విచ్‌లకు మరమ్మతులు చేపట్టాలి.

– తిరుమలేష్, అయిజ

నివేదిక అందజేశాం



మండల కేంద్రంలో మొత్తం 140 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అనేక ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో సుమారు 30 ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు పనిచేయడం లేదు. దీంతో ఎల్‌సీ తీసుకునప్పుడల్లా 11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

– నరేందర్ రెడ్డి, విద్యుత్ ఏఈ

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాటులో భాగంగా అయిజ పట్టణ సమీపంలో ఎన్‌హెచ్‌ఏఐ వారు విద్యుత్ లైన్లు మార్చే పనులు చేపడుతున్న సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టీఎస్‌ఎస్ పీడీసీఎల్ ఏడీఈ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మల్దకల్ మండలంలోని మద్దెలబండ 33/11 కేవీ ఫీడర్‌కు సరఫరా చేసే విద్యుత్‌ను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. దానివల్ల మద్దెలబండ, తండా, నేతోనిపల్లి గ్రామాలకు తాటికుంట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని తాటికుంట గ్రామం, నాగర్‌దొడ్డిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని నాగర్‌దొడ్డి, అయిజ మండలంలోని తూంకుంట గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మసీద్ ప్రహరీ నిర్మాణానికి విరాళం



అలంపూర్ రూరల్: పట్టణంలోని అక్బర్‌పేట కాలనీలోని ఖాలీమసీద్ ప్రహరీ నిర్మాణానికి రూ.30వేల విరాళం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్‌ఖాన్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆసీఫ్‌ఖాన్ ముస్లిం పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షెక్‌హుస్సేన్, ఎండీ షుకూర్, షాలీమియ్య, హాజీ, పరశురాం, నాయుడు,

పంచాయతీ కార్యదర్శిని కొనసాగించాలి

అలంపూర్ రూరల్: మండలంలోని జిల్లెలపాడ్ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర వారం క్రితం బదిలీ అయ్యాడు. మళ్లీ జిల్లెలపాడ్ గ్రామానికే పంచాయతీ కార్యదర్శిగా కొనసాగించేలా అధికారులు చొరవ తీసుకోవాలని మాజీ ఉప సర్పంచ్ లాల్‌నాయుడు, మౌలాలి, అచ్చన్ననాయుడు, శ్రీపతినాయుడు, శ్రీనివాసులు, మద్దిలేటి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తమ గ్రామ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునందించారని, అటువంటి వ్యక్తి ఇక్కడే విధులు నిర్వహిస్తే గ్రామం ఇంకా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

కొళాయి వద్ద దుర్గంధం



మానవపాడు: మండలంలోని ఎస్సీకాలనీలో మిషన్‌భగీరథ తాగునీరు కొళాయి వద్ద మురుగువాసనతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు మురుగుతో కలుషితం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొళాయి చుట్టూ ఈగలు, దోమలు, దుర్గంధం వెదజల్లు తెలిపారు. తాగునీటికి మురుగు వాసనతో రోగాలబారిన పడుతున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు ఇప్పటకైనా స్పందించి మురుగును తొలగించి శుభ్ర పరిచి, పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు



మానవపాడు: వేసవి దృష్ట్యా పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో మూగజీవాలకు ఏర్పాటు చేసి నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో పశువుల నీటి కొరత ఏర్పడి విలవిలలాడుతున్నాయి. అధికారులు దెబ్బతిన్న నీటితొట్లకు మరమ్మతులు చేయించలేదు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో పశువులకు నీరు తాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన హుస్సేన్ అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ నాయకులతో వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిమిత్తం పోతురాజు శంకరమ్మ ట్రస్టు చైర్మన్ సోమనాద్రి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. జోగుల రవి, రాముడు, ఎల్కూరు హనుమంతు, జాకీర్, పెద్ద సవరన్న, కొండన్న, రాజ్, గ్రామపెద్దలు ఉన్నారు.

మంచిమార్గంలో నడవాలి



బూడిదపాడులో త్రైతసిద్ధాంతంపై అవగాహన కల్పిస్తున్న సేవాసమితి సభ్యులు

మల్దకల్: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి కొత్తకోట అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని బూడిదపాడులో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక, త్రైతసిద్ధాంతం గ్రంథాలను ప్రచారం చేశారు. భగవద్గీత ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజలలో దైవభక్తిని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాలు తెలుసుకోవడం ద్వారా ధర్మస్థాపన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి సభ్యులు మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రత్యేక ఓటరు నమోదు



ఇటిక్యాలలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి పకడ్బందీగా నిర్వహించారని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇటిక్యాల, షాబాద్, ఉదండాపురం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆయన తనిఖీ చేసి ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 49 పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు కలిసి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 84 మంది ఓటు నమోదు కాని వారిని గుర్తించి వారి పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

బస్సుల్లేక విద్యార్థుల అవస్థలు



గట్టు నుంచి రాయాపురానికి బస్సు లేక పోవడంతో ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న బాలికలు

గట్టు: రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చదువుకోవాలని కోరిక ఉన్నా, పాఠశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక చదువుకు స్వస్తీ చెప్పాల్సి వస్తోంది. గద్వాల నుంచి గట్టుకు సరైన బస్సు సౌకర్యాలు లేక ఆయా గ్రామాల ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పని చేసే ఉద్యోగులు సైతం ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు హై స్కూల్ చదువు కోసం గొర్లఖాన్‌దొడ్డి, పెంచికలపాడు, రాయాపురం గ్రామాల నుంచి ప్రతిరోజు ఉన్నత పాఠశాలకు వస్తుంటారు. ఈ గ్రామాల నుంచి వెళ్లిరావడానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆలూరు, గట్టు రూట్లో ఉదయం, సాయంత్రం బస్సులు రెగ్యులర్‌గా నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి రూట్లో కూడా పాఠశాల వెళ్లి రావడానికి అనుకూలంగా బస్సులను నడపాలని విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎండిన ప్రకృతివనం.. ఖర్చు ఘనం



డి.బూడిదపాడులో ఎండుతున్న ప్రకృతి వనం

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులోని ప్రకృతివనం నీరు లేక ఎండిపోయింది. మిషన్ భగీరథ నీటి ట్యాంకులు అందుబాటులో ఉన్న పట్టించుకోలేదు. ప్రకృతి వనానికి దాదాపు లక్షల్లో ఖర్చు చేసి మొక్కలు నాటినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా ట్యాంకులు ఉన్న నీరు లేక వనాన్ని ఎండబెట్టడం ఎంత వరకుసంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



వృథాగా నీటి ట్యాంకులు

'పది'కి పకడ్బందీగా ఏర్పాట్లు

మానవపాడు: పదో తరగతి పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. ఆదివారం పదో తరగతి పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లు నిర్వహించారు. సోమవారం పదో తరగతి విద్యార్థులు 283 మంది పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటుందని, గతంలో 5 నిమిషాలు ఆలస్యమైన అనుమతులు ఉండేవికావు. ఈ సారి 5 నిమిషాలు ఆలస్యమైన పరీక్షకు అనుమతి ఇస్తారని తెలిపారు. విద్యార్థులకు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో తహసీల్దార్ పూజలు



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం గట్టు తహసీల్దార్ సరితరాణి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి శాలువాతో సన్మానించారు. వారి వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు.

లేగదూడలకు జన్మనిచ్చిన ఆవు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లిలో కేవలం పావుగంట వ్యవధిలోనే ఆవు రెండు కవల లేగదూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా ప్రతి ఆవు కేవలం ఒక ఆవుదూడకు మాత్రమే జన్మనిస్తుంది. ఒకే ఈతలో రెండు లేగదూడలకు ఆవు జన్మనివ్వడంతో యజమాని బోయ సవరన్న ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై చిన్న ఆముదాలపాడుకు చెందిన రాజు బైక్‌పై కర్నూల్ వైపు వెళ్తుండగా, వెనక నుంచి అతివేగంగా హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న కర్ణాటకకు చెందిన భరత్ మరో బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. దీంతో రాజు కాలుకు గాయాలు కావడంతో బొటనవేలు కట్ అయ్యింది. హైవే అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఉద్యోగికి సాధికారత అవార్డు

వనపర్తిటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న పట్టణానికి చెందిన డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ శ్రీవాణి సేవలకుగాను ఆదివారం హైదరాబాద్‌లో ఫర్ యాంటీ కరప్షన్ ముందడుగు ఫౌండేషన్ వారు మహిళా సాధికారత 2024 అవార్డును అందజేశా రు. 2008 నుంచి మహిళల, బాలికల, వృద్ధుల సమస్యలపై, మహిళా సంఘాల సభ్యురాలిగా, 2015 లో పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున ఫ్యామిలీ కౌన్సెలింగ్ మెంబర్‌గా ఎన్నో కుటుంబకలహాలను పరిష్కరించారు. ఆర్డీఎస్, సఖి స్వచ్ఛంద సంస్థలో ఎన్నో సామాజిక, కుటుంబ, ఆర్థిక సమస్యల్లో ఉన్న మహిళలకు తన సహాయసహకారాలను అందిస్తున్న శ్రీవాణికి అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్‌ఐ విజయభాస్కర్



కర్తదానం చేస్తున్న యువకులు

అయిజ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యూత్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మెడికల్ బ్లడ్ బ్యాంక్ ఆఫీ సర్ వినిమ తేజశ్రీ సిబ్బందితో కలిసి 25 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో అనేక సార్లు బాధితులకు అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, అనారోగ్యంతో బాధపడే వారికి కూడా రక్తం అవసరమవుతుందన్నారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేస్తే వైద్యులు ఎంతోమంది ప్రాణాలను కాపాడగలుగుతారన్నారు. వైద్యుల సలహా మేరకు యువత వీలైనన్నిసార్లు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సి బ్బంది రాకేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శాంతినగర్: నేటి నుంచి నిర్వహించే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నరసింహులు తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని ఆయా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 725 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. శాంతినగర్‌లో 3 సెంటర్లు ఏర్పాటు చేశారు. రవీంద్ర పాఠశాల సెంటర్‌లో 170 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల శాంతినగర్‌లో 220 మంది, రాఘవేంద్ర పాఠశాలలో 285 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 37 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పర్యవేక్షించనున్నారు. పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించామని ఎంఈఓ పేర్కొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మూడు పాఠశాలల్లో 419 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది విద్యార్థులు, ప్రాథమిక పాఠశాలలో 132 మంది విద్యార్థులు, మైనార్టీ పాఠశాలలో 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పాఠశాలల చీఫ్ సూపరింటెండెంట్ అమరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, నిర్మల, జ్యోతి తెలిపారు.

రాజోళి: నేటి నుంచి పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న సందర్భంగా వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రిపైనా ఉందని ఎంపీపీ మరియమ్మ అన్నారు. గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు తల్లిదండ్రులతో పాటు వాహనదారులు తప్పకుండా వారిని పరీక్షకు సమయానికి హాజరయ్యేవిధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మాన్ని ఆచరిస్తూ జీవించాలి

రాజోళి: ధర్మాన్ని ఆచరిస్తూ జీవించడమే మనిషికి ఉత్తమమైన మార్గమని ధర్మప్రచార సమితి సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ధర్మం అంటే ఏమిటి, ధర్మ పరిరక్షణకు చేయాల్సిన పనులను వివరించారు. కమిటీ అధ్యక్షుడిగా బసోది అంజి, ఉపాధ్యక్షుడిగా తిరుమలేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీన్, సలహాదారుడిగా అడివిస్వామి, గోవిందు రాజులను ఎన్నుకున్నారు.



వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో నూతన ధర్మప్రచార కమిటీ సమావేశం



జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా కృష్ణవేణి - అంబేద్కర్ చౌరస్తా

భానుడి భగభగ..

మార్చి నెలలోనే భానుడి భగభగతో ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9గంటల నుంచే ఎండల భగ్గుమంటున్నాయి. మధ్యాహ్నం అయ్యేసరికి 37 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఎండ తీవ్రంగా పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఈసారి ఆరంభంలోనే ఫిబ్రవరి నుంచే ఎండలు ప్రారంభమై మార్చి నెలలో ఎండల తీవ్రత మరింత పెరిగింది. రానున్న ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరిగే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు జనం టోపీలు, తువ్వాలలు, చెరుకు రసం, మజ్జిగలతో ఉపశమనం పొందుతున్నారు. ఈ దృశ్యాలు ఆదివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– గద్వాల అర్బన్



తలపై టవల్‌తో వెళ్తున్న వాహనదారుడు



ఎండకు తట్టుకోలేక తలపై స్కార్ఫులు వేసుకొని వెళ్తున్న మహిళలు

డాక్టరేట్ గ్రహీతలకు ఘన సన్మానం

వనపర్తిటౌన్: ప్రముఖ గణితావధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అనంతప్ప, ఉపాధ్యాయుడు రాములు విద్యాబోధనలో, వ్యక్తిత్వ వికాస మెళకువలపై చేసిన పరిశోధనలకు ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేయడంతో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా పాత గ్రంథాలయంలో ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, ప్రజా కవి జనజ్వాల మాట్లాడారు.